క్లుప్తంగా

ఉపాధి పనులతో అందరికీ మేలు



మండవల్లి: జాతీయ ఉపాధి హామీ పనులు అందరికీ మేలు చేస్తున్నాయని ఎంపీపీ ఎన్ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని నందిగామలంకలో రూ. 1.20 లక్షలతో ఉపాధి హామీ పనులు చేపట్టారు. 68 మంది ఉపాధి కూలీలు సోమవారం పనుల్లో పాల్గొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ఈ పనుల ద్వారా రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు పుష్కలంగా అందుతుందన్నారు.

బ్యాంక్ మేనేజర్‌కు సత్కారం



మండవల్లి: స్థానిక ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు బదిలీ కావడంతో ఈ సందర్భంగా ఖాతాదారులు, డ్వాక్రా యానిమేటర్లు, బ్యాంకు మిత్రలు, ఐక్య వేదిక, గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఇండియన్ బ్యాంకులో సోమవారం ఆయన్ను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, ఎల్ఎస్ భాస్కరరావు, సర్పంచ్ మెండా ఝాన్సీ, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, గుడివాడ మురళీకృష్ణ, తమ్మిస్వామి, సర్పంచ్‌లు రాజసులోచన, థామస్, సత్యనారాయణ, సత్యనారాయణరాజు, సుబ్బారావు, ఇస్సాకు, అప్పారావు, సత్తిబాబు, రత్నకుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు



గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటిమీద వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం కూడా కొనసాగాయి. కార్యక్రమంలో భాగంగా స్వామికి యాగశాల ప్రవేశం, కుంభారాధన, ద్వారతోరణపూజ, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠ హోమం జరిపారు. అనంతరం ధ్వజపటం ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు వేదాంతం అప్పలాచార్యులు మాట్లాడుతూ గరుడముద్ద ప్రసాదం స్వీకరించిన వారికి సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల సమ్మకం అన్నారు. మంగళవారం స్వామికి 108 కలశాలతో పంచామృతాభిషేకం జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలని ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం కోరారు.

విజయోత్సవ ర్యాలీ



పామర్రు: ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా విజయం సాధించినందుకు అభిమానుల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ర్యాలీ మచిలీపట్నం రోడ్డు నుంచి ప్రారంభమైంది. విజయవాడరోడ్డు మీదుగా ర్యాలీ చేశారు. అనంతరం స్థానిక పాల శీతల కేంద్రం కల్యాణ మండపంలో ఎమ్మెల్యేకు సన్మాన సభను నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేస్తానన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, నాయకులు వల్లూరిపల్లి గణేష్, ఈడే గంటేశ్వరరావు, నాని, రమేష్, జనసేన నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

మండవల్లి: అయ్యవారి రుద్రవరంలో ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అక్రమ మట్టి తవ్వకాలను నిరోధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

గుడివాడ టౌన్: త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్‌ను సోమవారం పట్టణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింలు ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని అన్ని మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించారు. దేవునియెడల విశ్వాసం, నమ్మిక ఉంచడమే ఖురాన్ యొక్క ప్రామాణికమని గురువులు తెలిపారు. ముస్లింలు పరస్పరం ఆలింగనం చేసుకుంటూ బక్రీద్‌ను జరుపుకున్నారు.

పామర్రులో..

పామర్రు: మండలంలోని ముస్లింలు సోమవారం బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక చిన్న మసీదులో సామూహికంగా ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమామ్ యూనుస్ మాట్లాడుతూ అల్లాహ్ సందేశం ప్రకారం ఇబ్రహీం ప్రవక్త తన కుమారుడి బలిదానం చేయుటకు సిద్ధపడ్డారన్నారు. దానికి ప్రతీకగా బక్రీద్‌ను జరుపుకుంటారని పేర్కొన్నారు. మత పెద్దలు అబ్దుల్లా, ఆరీఫ్, ముస్తఫా, ఇబ్రహీం, కరీముల్లా, ఖలీక్, షోయిబ్, ఎండీ జమీల్ పాల్గొన్నారు.

పమిడిముక్కల(పామర్రు): మండలంలోని అలీనఖీ పాలెంలోని పెద్ద మసీదు వద్ద బక్రీద్ జరుపుకున్నారు. పెద్ద మసీదు 'మస్జిద్ హుస్సేనీ జామియా' నందు మత గురువు మౌలానా మీర్జా ఇబ్రహీం బక్రీద్ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పెద్దలు అంజామన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: బక్రీదును ముస్లింలు సోమవారం జరుపుకున్నారు. అల్లినగరం, ఉనికిలి, సింగనపూడి తదితర గ్రామాల్లో బక్రీదు సందర్భంగా ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. త్యాగనిరతికి దాతృత్వానికి ప్రతీక బక్రీద్ అని ముస్లిం మత పెద్దలు అన్నారు.



గుడివాడలో బక్రీద్ ప్రత్యేకతను వివరిస్తున్న ముస్లిం మత గురువులు



తోట్లవల్లూరు మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



పామర్రు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఇమామ్ యూనుస్, ముస్లింలు

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్‌ను మండలంలోని ముస్లింలు సోమవారం జరుపుకున్నారు. ఉదయమే మసీదుల్లో ప్రార్థనలు చేసి ఆలింగనం చేసుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండగను పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ, టీడీపీ నేతలు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: బక్రీద్‌ను మండల వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే పిల్లలు, పెద్దలు పవిత్ర స్నానాలను ఆచరించి నూతన వస్త్రాలను ధరించి ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. తోట్లవల్లూరు జుమ్మా మసీదులో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మత గురువు హసన్ దైవసందేశం వినిపించారు.

మొవ్వలో..

భట్లపెనుమర్రు(మొవ్వ): స్వార్థపూరిత ఆలోచనలు లేకుండా, రాగద్వేషాలు వదిలేసి మానవతను వ్యాప్తి చేయాలన్నదే బక్రీద్ ప్రధాన ఉద్దేశం అని మత గురువు మహమ్మద్ యాకూబ్ పాషా పేర్కొన్నారు. మొవ్వ మండలంలోని మొవ్వ, నిడుమోలు, భట్లపెనుమర్రు, కోసూరు, కాజ గ్రామాల్లో సోమవారం బక్రీద్‌ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భట్లపెనుమర్రు గ్రామంలోని మసీదులో అంతర్జాతీయ అహ్మదీయ ముస్లిం జమాత్ ఆధ్వర్యంలో మత గురువు మహమ్మద్ యాకూబ్ పాషా, మదీద్ ప్రెసిడెంట్ షేక్ మౌలాలిల పర్యవేక్షణలో బక్రీద్‌ను నిర్వహించి పేదలకు ధాన ధర్మాలు చేశారు.

కైకలూరులో..

కైకలూరు: కైకలూరు నియోజకవర్గంలో ముస్లింలు బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. కైకలూరు పెద్ద, చిన్న మసీదుల నుంచి ర్యాలీగా స్థానిక ఈద్‌గా వద్దకు చేరుకున్నారు. మతగురువు ఇలాహుల్ హక్ అల్లా ప్రేమ సందేశాన్ని అందించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఒకరు నొకరు ఆలింగనం చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), మతాలకతీతంగా బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చిన్న మసీదు మత గురువు ఆఫీజ్ వసీం, రెండు మసీదుల అధ్యక్షుడు జిలానీ పాషా, ఎండీ హమీద్, ముస్లిం మత పెద్దలు మహమ్మద్ జహీర్, ఎండీ నూరిద్దీన్, అస్లాం, మహమ్మద్ అమీర్, ఎండీ ఖాసీం, ఇస్మాన్‌ఖాన్, ఎండీ ఆసీఫ్‌పాషా, ముషా, ఇక్బాల్, గాలిబ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



అలీనఖీపాలెంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



భట్లపెనుమర్రు మసీద్‌లో నమాజ్ చేస్తున్న ముస్లింలు



కైకలూరు ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు

20న దేవదాయ శాఖ భూముల వేలం

గుడివాడ టౌన్: గుడివాడ రూరల్ మండలం తట్టివర్రు గ్రామంలోని దేవదాయ శాఖ ఆధీనంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం భూముల కౌలు బహిరంగవేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎం. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఈ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సర్వే నంబర్ 139/2 – 2.46 ఎకరాలు, 108/2 – 5.57 ఎకరాలు భూమి మూడేళ్లకు కౌలు లీజుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు రూ. 4 వేలు, రూ. 10 వేలు దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవలసిందిగా ఈఓ శ్రీనివాసరావు కోరారు.

అభివృద్ధి దిశగా సమష్టి కృషి



కైకలూరు: ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సమష్టిగా కృషి చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుదామని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇటీవల ఆయన అస్వస్థతకు గురై హైదరాబాదు ఆస్పత్రిలో చికిత్స పొంది సోమవారం స్వగ్రామం వరహాపట్నం తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ప్రభుత్వ ఉపాధ్యాయులు, నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి టీడీపీ, జనసేన నేతలు, కొల్లేరు గ్రామాల నాయకులు పెద్ద ఎత్తున విచ్చేశారు. కామినేనికి పూల బొకేలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, టీడీపీ, జనసేన నేతలు బలే ఏసురాజు, ఏఈ శ్రీనివాస్, మాల్యాద్రి, పూలా రాజీ, కొల్లి బాబి, చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి, జయమంగళ సుబ్బరాజు తదితరుల పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

గుడివాడ టౌన్: గుడివాడ పురపాలక సంఘ పరిధిలో తలెత్తిన తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి కోరారు. సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు రెండు చెరువులు ఉన్నప్పటికీ వాటిని మరమ్మతు చేయకుండా నీటిని పూర్తి స్థాయిలో నింపకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోందన్నారు. ఇందుకు అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. సాధారణంగా 10 అడుగుల పైబడి లోతులో నీటిమట్టాలు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఆరు అడుగులు కూడా లేకపోవడం దీనికి కారణమన్నారు. వీటికి తోడు పట్టణంలో పైప్‌లైన్‌లు ఎక్కడపడితే అక్కడ లీక్‌లు ఏర్పడటంతో కలుషిత నీరు ప్రవహిస్తోందన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించి ప్రజలకు తాగునీరు అందించాలని ఆయన కోరారు. ఐద్వా కార్యదర్శి పి. రజిని పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

ఘనంగా బాబా మందిర వార్షికోత్సవం

మండవల్లి: స్థానిక శ్రీ దత్త పరంపర షిర్డి సాయిబాబా మందిరంలో 14వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. 18 రకాలతో భక్తుల స్వహస్తాలతో బాబాకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు.విజయవాడకు చెందిన అఖిలాండ అఖండ జ్యోతి వ్యవస్థాపకుడు రాంజీ గురువు నేతృత్వంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, యిన్నా వెంకటేశ్వరరావు, పూల రామకృష్ణ, గుడివాడ రాము, పెరుమాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.



మండవల్లి బాబా ఆలయంలో నిర్వహిస్తున్న లక్ష్మీ గణపతి హోమం

గోతిని పూడ్చేశారు

గుడివాడ టౌన్: స్థానిక సత్యనారాయణపురం నాల్గో లైను రాజదర్బార్ వీధిలో ఓ స్థలం యజమాని సుమారు 10 అడుగుల లోతులో మట్టిని తొలగించారు. తిరిగి దానిలో ఏ విధమైన కట్టడాలు కట్టకుండా వదిలివేయడంతో వర్షాలు కురిసి గోతిలో భారీగా నీరు నిలిచింది. దీంతో దోమలు భారీగా పెరగడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీనికి సమీపంలో ఉన్న సీసీ రోడ్ బీటలు వారడం ప్రారంభమైంది. స్థానికుల సమాచారం మేరకు సాక్షి దినపత్రిక ఈనెల 13వ తేదీన 'ఈ గోతిని పూడ్చరూ..' అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. స్పందించిన మున్సిపల్ అధికారులు స్థలం యజమానితో గోతిని పూడ్చించే కార్యక్రమం చేపట్టారు. సోమవారం గోతిని పూడ్చే ప్రక్రియ ప్రారంభించారు.

సాక్షి స్పందన



కనుల పండువగా జగజ్యోతి

- ఆకట్టుకున్న పార్వతీ కల్యాణం హరికథ
- రెండో రోజు రంగనాయక, రామలింగేశ్వరుని ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు

మచిలీపట్నం టౌన్: నగరంలోని ప్రధాన రహదారి రాబర్ట్‌సన్‌పేటలో పక్క పక్కనే ఉన్న వేంచేసి ఉన్న శ్రీ దేవీ, భూదేవి సమేత శ్రీ రంగనాయక స్వామి, శ్రీ పర్వతవర్ధినీ, శ్రీ రాజరాజేశ్వరీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో స్వామి వార్ల వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు సోమవారం రెండో రోజు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ రంగనాయకస్వామి ఆలయంలో రాత్రి నిర్వహించిన జగజ్యోతి కార్యక్రమం కనుల పండువగా జరిగింది. బీరం త్రినాథ్, మహాలక్ష్మి దంపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజపట ఊరేగింపు కనుల పండువగా నిర్వహించారు. తాడేపల్లి నాంచారయ్య దంపతులు అంకురారోహణ, కొప్పర్తి నరశింహమూర్తి దంపతులు నిత్య బలిహరణ కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రికి భాగవతారిణి పి.లక్ష్మీ లీల చెప్పిన పార్వతీ కల్యాణం హరికథ భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి బి.సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

ముంపు సమస్య లేకుండా చర్యలు

కోడూరు: ఖరీఫ్ సీజన్‌లో పంటపొలాలు ముంపు బారిన పడకుండా డ్రెయినేజీలు ప్రక్షాళన చేసి ముందస్తు చర్యలు చేపట్టనున్నట్లు ఆ శాఖ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం కోడూరులోని పలు మురుగు డ్రెయిన్లను స్థానిక టీడీపీ, జనసేన నేతలతో కలిసి డీఈ పరిశీలించారు. డ్రెయినేజీల్లో పెరుకుపోయిన చెత్తాచెదారం, సీల్ట్‌ను తొలగించనున్నట్లు డీఈ చెప్పారు. అధిక వర్షాలు పడినా కూడా పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సీజన్ ప్రారంభం కాకముందే పనులు చేస్తామని డీఈ చెప్పారు. జనసేన పార్టీ మండలాధ్యక్షుడు మర్రే గంగయ్య, ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శి కొండవీటి సురేష్, టౌన్ అధ్యక్షుడు కోట రాంబాబు, మాజీ డీసీ వైస్ చైర్మన్ కాగిత రామారావు, పాల్గొన్నారు.



నేడు కాళ్లపాలెం డాక్టరు విగ్రహావిష్కరణ



కైకలూరు: పేదల డాక్టరుగా పేరు తెచ్చుకున్న దివంగత బత్తిన నరసింహారావు (కాళ్లపాలెం డాక్టరు) విగ్రహాన్ని వరహాపట్నం గ్రామ పరిధి బొల్లినంపాడు అగ్రహారంలో మంగళవారం ఆవిష్కరించనున్నారు. ఆయన 2020 కరోనా సమయంలో మృతి చెందారు. ఎంతో మంది పేదలకు డబ్బుతో సంబంధం లేకుండా సేవలు అందించారు. ప్రధానంగా పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఎందరినో బతికించారు. నియోజకవర్గంలో ఆయన వైద్యానికి మంచి పేరుంది. ఆయన విగ్రహాన్ని బొమ్మినంపాడు శిల్పకళా కేంద్రం నుంచి ఊరేగింపుగా కోరుకొల్లు, కలిదిండి, కాళ్లపాలెం, వరహాపట్నం మీదుగా బి.అగ్రహారం తీసుకొచ్చారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆవిష్కరిస్తారని విగ్రహ నిర్మాణ కమిటీ తెలిపింది. కాళ్లపాలెం డాక్టరు అభిమానులు, గౌడ సంఘీయులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఘనంగా అయ్యప్పస్వామి వార్షికోత్సవం



కృత్తివెన్ను: మండల పరిధిలోని సీతనపల్లి స్లోపు వద్ద గల అయ్యప్పస్వామివారి దేవస్థానం 26వ వార్షిక మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు మంగళవారంతో ముగియనున్నట్లు ఆలయ చైర్మన్ కె.నాగబాబు తెలిపారు. ప్రతి రోజూ స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు విశేషమైన అభిషేకములు నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం ఆలయం వద్ద స్వామివారి అఖండ అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

కూలిన వంతెన పరిశీలన



కైకలూరు: కూలిన వంతెనకు అధికారులు తక్షణమే మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 11న కలిదిండి మండలం తాడినాడ–పోతుమర్రు గ్రామాల నుంచి పెదకొమ్ములేరు కాలువపై 50 ఏళ్ల క్రితం నిర్మించిన సిమెంటు వంతెన భారీ వాహనం వెళ్లడంతో మధ్యలో కూలింది. కలిదిండి నుంచి పోతుమర్రు, తాడినాడ, చినతాడినాడ మీదుగా పశ్చిమగోదావరి ప్రమాణానికి ఈ వంతెన దగ్గర మార్గంగా ఉంది. హైదరాబాదు హాస్పిటల్లో చికిత్స చేయించుకుని వచ్చిన కామినేని విషయం తెలుసుకుని కూలిన వంతెన వద్దకు సోమవారం వెళ్లారు. ఆర్అండ్‌బీ డీఈ విజయశేఖర్, పంచాయతీ సెక్రటరీ ప్రద్యుమ్నను త్వరగా మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఆర్అండ్‌బీ డీఈ మాట్లాడుతూ ముందుగా కూలిన భాగానికి ఇనుప గ్రిల్స్‌తో మరమ్మతుల చేయాలని, నూతన వంతెన నిర్మాణానికి అంచనాలు రూపొందించాలన్నారు. కలిదిండి మండల టీడీపీ అధ్యక్షుడు పోకల జోగిరాజు, నాయకులు శ్రీనివాసచౌదరి, బాబు పాల్గొన్నారు.

సాగుకు రైతులు సమాయత్తం




చినకామనపూడలో ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు

ముదినేపల్లి రూరల్: సార్వా వరి సాగు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇటీవల సాగుకు అనుకూలంగా వర్షాలు కురవడంతో రైతులు సార్వా పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా చేలల్లో దుక్కు దున్నుతూ విత్తనాలు చల్లేందుకు సమాయత్తమవుతున్నారు. మండలంలో 15 వేల ఎకరాలకు పైగా సార్వా వరి సాగు జరుగుతుందని అంచనా. ఇందులో అత్యధిక భాగం నేరుగా విత్తనాలను వెదజల్లే పద్ధతిలో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఇసుక, మెరక భూముల్లో వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్నారు. కూలీల కొరత వల్ల నారుమడు, నాట్లు వేసే అవసరం లేకుండా నేరుగా విత్తనాలు వెదజల్లుతున్నారు. పల్లపు, ఒండ్రు నేలల్లో నారుమడులు వేసి నాట్లు వేసే పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఎక్కువగా ఎంటీయూ–1318, స్వర్ణ వంటి వరి రకాలను సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ రకాలు గత సార్వాలో అధిక దిగుబడులను ఇవ్వడంతో వీటిపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లోని పొలాల్లో విత్తనాలు వెదజల్లారు. మరోసారి వర్షం కురిస్తే ఈ విత్తనాలు మొలకెత్తేందుకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని రైతులు భావిస్తున్నారు. నారుమడులు పోసేందుకు తప్పనిసరిగా పంట కాలువలకు నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు నీరు విడుదల చేయకపోవడంతో నారుమడులు పోసే అవకాశం ఏర్పడలేదు. ఈ నెలాఖరుకు కాలువలకు నీటిని విడుల చేస్తారని రైతులు భావిస్తున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలు సాగు అవసరాలకు కొంత మేర మాత్రమే ఉపయోగపడతాయని మరిన్ని వర్షాలు కురిస్తేనే సాగు సజావుగా సాగుతుందని రైతులు తెలిపారు.

20 నుంచి వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

నిమ్మకూరు(పామర్రు): టీటీడీ ఆధ్వర్యంలో గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఈ నెల 20న మూలవరులకు అభిషేకం, రాత్రికి అంకురారోపణం, సర్వ దేవతాహ్వానం ఉంటుందని పేర్కొన్నారు. 21న ఉదయం భేరీపూజ, గ్రామ బలిహరణ, ధ్వజారోహణం, రాత్రికి శేష వాహనసేవ ఉంటుందని తెలిపారు. 22న ఉత్సవర్లకు పంచామృత స్నపన, పెండ్లికుమారుడి చేయడం, రాత్రికి నిత్యార్చన హోమ బలిహరణ ఉంటుందని పేర్కొన్నారు. 23వ తేదీ రాత్రి ఏడు గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసమూర్తికి దివ్య తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 24న ఉదయం గరుడవాహనోత్సవం, గ్రామోత్సవం, రాత్రికి మహా శాంతి హోమం ఉంటుందని పేర్కొన్నారు. 25న ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, అనంతరం పూర్ణాహుతి, రాత్రికి తెప్పోత్సవం, ధ్వజారోహణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 26న ఉదయం శ్రీపుష్పయాగోత్సవం అనంతరం అన్న సమారాధన, రాత్రికి ద్వాదశ ప్రదక్షిణాలు, డోలోత్సవం, సహస్ర దీపాలంకరణసేవ, ఏకాంత సేవ, ఆచార్యసన్మానం, తీర్థ ప్రసాద వినియోగం ఉంటుందని పేర్కొన్నారు. ఆలయ అర్చకులు సుదర్శనం యోగానంద లక్ష్మీ నరసింహాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసమూర్తుల మూలవిరాట్టులు